క్లుప్తంగా

వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: వాహనదారులు తమ వెంట వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని పట్టణ సీఐ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం న్యూ బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన డాక్యుమెంట్లు లేని 25 వాహనాలను సీజ్ చేశారు. పోలీస్‌శాఖ ప్రమాదాలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేశ్, మన్మథరావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం మోతె శివారులోని గొల్లపల్లి రోడ్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై రియాజ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్ కుటుంబానికి ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ



ఎంపీ అర్వింద్‌ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: ఉమ్మడి రాష్ట్ర మాజీ పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డి.శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆయన కుమారుడు ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వారి నివాసంలో కలిసి పరామర్శించారు.

వెంకటేశ్వర్లుకు జ్యోతిష్యరత్న అవార్డు



సన్మానిస్తున్న అర్చకులు శరత్‌కుమార్ శర్మ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యులు అల్లె వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లో జ్యోతిష రత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో వైదిక జ్యోతిష సమ్మేళనంలో వెంకటేశ్వర్లుకు జ్యోతిష్యరత్న అవార్డు వరించింది. యీ సందర్భంగా రాజరాజేశ్వర దేవస్థానం వేములవాడ ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్‌కుమార్ శాలువా కప్పి అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం: శ్రీ పావని క్రిటికల్ కేర్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి జగిత్యాల ఆధ్వర్యంలో మండలంలోని ఎర్దండిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పెద్దిరెడ్డి శ్రీకాంత్, పావని 280 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ రాధ, నాయకులు దాసరి గంగనర్సయ్య, బాశెట్టి రాజేందర్, నీరేటి రతన్, దాసరి నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం

జగిత్యాలజోన్: జెడ్పీ చైర్ పర్సన్‌గా పదవీ విరమణ చేసిన దావ వసంత దంపతులను జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మణికొండ రమేష్, జిల్లా అధ్యక్షుడు వొద్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ, హరి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నేలపైనే విద్యార్థుల చదువులు

మేడిపల్లి: మేడిపల్లి గురుకుల బాలుర పాఠశాలలో సరిపోయినన్ని డెస్కులు లేకపోవడంతో విద్యార్థులు నేలపై కూర్చొని విద్యభ్యాసం చేస్తున్నారు. 1985లో ప్రారంభమైన గురుకుల పాఠశాల ఎంతో మంది ప్రముఖులను తీర్చిదిద్దింది. పాఠశాల విద్యతో పాటు ఇంటర్‌మీడియట్ వరకు చదువుకునే వెసులుబాటు ఉంది. సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఈ గురుకులంలో చదువుతున్నారు. సరిపోయిన్ని డెస్కులు లేక ఇబ్బందులు పడుతున్నాయని, డెస్కులు సమకూర్చాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇతర కొన్ని వసతులు కల్పించాలని కోరారు.



రోడ్డుపై గుంతలతో ఇబ్బందులు

మల్యాల: మండల కేంద్రంలోని విద్యానగర్ సమీపంలోని రోడ్డంతా భారీ గుంతలతో అస్తవ్యస్తంగా మారింది. స్థానిక బీరయ్య ఆలయం నుంచి వచ్చే వరదనీటితో ఏటా రోడ్డు భారీ గుంతలు పడుతున్నా, మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. వర్షానికి గుంతలు నిండడంతో, ఆ దారి గుండా వెళ్తే వాహనాలు గుంతల్లో దిగబడుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, తాత్కాలికంగానైనా మట్టితో గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ప్రయోగశాల గది

పెగడపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల గది నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ పాఠశాలలో ప్రయోగాలతో సైన్స్ విద్యను అందించి సత్ఫలితాలు సాధించడానికి రూ. 9 లక్షలు వెచ్చించి ఈ గదిని నిర్మించారు. గది నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా భవనం వినియోగించడం లేదు. పాఠ్య పుస్తకాల్లోని అంశాలను ప్రయోగాత్మకంగా బోధించేందుకు వీలుగా ప్రత్యేకంగా భవనం నిర్మించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక భవనం అప్పగించ లేదని తెలుస్తోంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి భవనం వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

కార్మికుల డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పుప్పాల శ్రీకాంత్

జగిత్యాలటౌన్: జూలై 10న జరిగే కార్మికుల డిమాండ్స్ డే ను జయప్రదం చేయాలని సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్(సీఐటీయూ)రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ కార్మికులకు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ మరియు ఎంప్లాయిస్ యునియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశానికి పుప్పాల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన అక్రమ లేబర్ కోడ్‌ల రద్దు, సహజ వనరులు, పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 10న నిర్వహించనున్న కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పులి మల్లేశం, నాయకులు రాజేందర్, రాజన్న, పోచయ్య, అశోక్, నర్సయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మేడిపల్లిలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు



కోరుట్లలో జెండావిష్కరిస్తున్న నాయకులు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో మండల మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచారు. మాదిగ జాతిని తలెత్తుకునేలాగా చేసిన మంద కృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిలివేరి వెంకటేష్, టాయ్స్ మండల అధ్యక్షుడు భంగారు దీపక్, మకిలి కుమార్, నల్ల నర్సయ్య, చిట్యాల శ్రీనివాస్, నల్ల గణేష్, నల్ల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల టౌన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం కోరుట్ల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించి, వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెట్టుపెల్లి లక్ష్మణ్, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు శనిగారపు రాజేశ్, చిట్యాల ప్రభాకర్, మహేశ్, విజయ్ పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడు చెందోలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండా ఎగుర వేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

దేశంలో గురువుకు విశిష్ట స్థానం



మాట్లాడుతున్న సాయి మధుకర్

రాయికల్: భారతదేశంలో గురువుకు ఒక విశిష్ట స్థానం ఉందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ్ సాయి మధుకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గురుపూజ ఉత్సవంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సనాతన హిందు విశ్వగురు భారతద్యేయంగా సంఘం పనిచేస్తుందన్నారు. హిందు ఆచార సాంప్రదాయాలను ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. హిందూ ధర్మాన్ని అందరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో జూపల్లి తిరుపతిరావు, డాక్టర్ తురగ రాజరెడ్డి, మల్లారెడ్డి, తోపారపు రవీందర్, ఎర్దండి ముత్యంరాజు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ వైభవ ప్రవచనాలు



మాతలతో తులసి పూజ చేయిస్తున్న విషుశర్మ

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఆధ్యాత్మిక కేంద్రం గీతాభవన్‌లో సౌందర్య లహరి దేవీవైభవం ప్రవచనాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ జ్యోతిష్య పౌరాణిక వేద పండితులు శ్రీమాన్ నంబివేణుగోపాలచార్య కౌశిక, పురాణ బ్రహ్మ సభాపతి విషుశర్మల ఆధ్వర్యంలో ఈరోజు ప్రవచనంలో శంకరాచార్య వైభవం విజయ యాత్ర ప్రవచనాలు వీనుల విందుగా వినిపించారు. 9 మంది పెళ్లికాని బ్రాహ్మణ యువతులతో కుమారి పూజ చేయించారు. కార్యక్రమంలో నార్ల రజని, గంప రజని, పాత రాధ, సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలె కుమార్, ఉపాధ్యక్షుడిగా చెట్టిపెల్లి అశోక్, కార్యదర్శి బాలె రాజేశం, సహాయ కార్యదర్శి బాలె బాలరాజు, కోశాధికారి మ్యాన రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య అభినందించారు.

బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సూర్య ప్రకాశ్



సూర్యప్రకాశ్

జగిత్యాలటౌన్: బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా మారిశెట్టి సూర్యప్రకాశ్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. సామాజిక కార్యక్రమాలు, బీసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని బీసీలను చైతన్య పరిచిన సూర్యప్రకాశ్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధర్మపురి: చేతికందిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆ తల్లిదండ్రులకు కడుపు కోతను మిగిల్చిందని బుగ్గారం మాజీ జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మపురికి చెందిన కాలసాని హరిబాబు చిన్న కుమారుడు రాజేందర్ (19) శనివారం హైదరాబాద్ జిల్లా మేడిచర్ల మండలంలో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందగా, ఆదివారం రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళి అర్పించారు.

వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తమ్మనవేని రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్సపొందుతున్నాడు. వైద్యం కోసం చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో ఆదివారం శ్రీకృష్ణ యాదవ యూత్ సంఘ సభ్యులు స్పందించి రూ.50వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా వీరిని గ్రామస్తులు, సభ్యులు అభినందించారు.

రక్త దాతకు సన్మానం

ధర్మపురి: అత్యవసర పరిస్థితిల్లో ఎంతో మందికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన రక్తదాతను ఆదివారం శాల్వాలతో సన్మానించారు. మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన దావన్‌పెల్లి మధూకర్ 49 సార్లు రక్త దానం చేసాడు. ఈ సందర్భంగా స్నేహమిత్ర యూత్ వ్యవస్థాపకులు జాజాల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కుట్టుమిషన్లు బహూకరణ

ధర్మపురి : ధర్మపురిలోని శారద మహిళా మండలికి 5 కుట్టుమిషన్లను బహూకరించారు. న్యూయార్క్ యుఎస్ఏ సస్థ వారి సౌజన్యంతో ధర్మపురి వాస్తవ్యులు పెద్దంబట్ల రాజేంద్రప్రసాద్ సహకారంతో ఆదివారం సాయంత్రం శారద మహిళా మండలికి కుట్టుమిషన్లను బహూకరించారు. ఈసందర్భంగా మహిళా మండలి వారి ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలను నాయకులు వివరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్ సంతోషి, మహిళ సంఘం అధ్యక్షురాలు మద్యాచారి విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు ఎస్ దినేష్, వ్యవసాయ పరిశోధకులు కొరిడె దత్తాత్రి తదితరులున్నారు.

ఆలయంలో ఆషాడమాస పూజలు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల గ్రామ శివారులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం ఆషాడమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, గోరింటాకు, గాజులను అమ్మవారికి సమర్పించారు. జగిత్యాల జిల్లాలోని పలు మండలాల నుండి మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏడాదికే దెబ్బతిన్న సీసీ రోడ్డు



ఎస్సీ కాలనీలో గతేదాది పోసిన సీసీ రోడ్డు

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ ఎస్సీ కాలనీలో పోసిన సీసీరోడ్డు దెబ్బతింది. గతేదాది ఈజీఎస్ నిధులు రూ. 10 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఏడాదికే గుంతలు పడి కంకర తేలటంతో అధికారుల పర్యవేక్షణ సరిగా లేక నాసిరకం పనులు చేశారని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

యాభై ఏళ్లకు ఆత్మీయ కలయిక..



50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోరుట్ల: వాళ్లందరూ విశ్రాంత జీవితం గడుపుతున్నారు. కొందరు ఉద్యోగ విరమణ చేయగా, మరి కొందరు మనుమలు, మనుమరాళ్లతో ఆనంద జీవితం గడుపుతున్నారు. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న 1973–74 బ్యాచ్ పూర్వ విద్యార్థులందరూ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఒకే చోట కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చిన్న నాటి చిలిపి పనులు, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పిల్లా పాపలు కుశల ప్రశ్నలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. వాళ్లతో చదువుకుని మృతి చెందిన స్నేహితులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సింగిరెడ్డి నారాయణ రెడ్డి, బర్ల సాయన్న, ఉయ్యాల నర్సయ్య, శామ్యుల్ నాయక్, పుప్పాల ప్రభాకర్, చేన్నా విశ్వనాథం పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009–10వ సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులను పూల వర్షంతో స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. పాఠశాలలో తమ తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి హెచ్‌ఎం గంగాధర్, ఉపాధ్యాయులు సత్యరాజ్ ,సురేందర్, పాషా, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు





కోరుట్లలో బోనమెత్తిన ఎమ్మెల్యే సంజయ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్రులు వలలు ప్రదర్శించారు. డప్పు చప్పుళ్లు, పోతు రాజుల విన్యాసాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, నాయకులు గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, ముక్కెర లింబాద్రి, వీడీసీ, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాలు చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు బోనాలు ఎత్తుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

మారమ్మ తల్లి పండుగ..

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 28 కుల సంఘాల సభ్యులతో ఘనంగా మారెమ్మ తల్లి పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మారెమ్మ తల్లికి బోనాలు, డప్పు చప్పుళ్లతో, పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి దేవతకు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

రామరాట పోచమ్మ బోనాలు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో ఆదివారం రామరాట పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనంతో ఆలయం వరకు చేరుకుని దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వన భోజనాలు చేశారు.

ఘనంగా బంగారు పెద్దమ్మ బోనాలు

మెట్‌పల్లి: పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయ 14 వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాలు ఘనంగా నిర్వహించారు. భూదేవి ఆలయం నుంచి బోనాలతో ఊరేగింపుగా శివారులో ఉన్న పెద్దమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి, బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.